
సాక్షి
చిత్తూరు
సోమవారం । 18 । ఆగస్టు । 2025



ముగిసిన తిరుణాల

సత్యప్రమాణాలకు నిలయమైన రాజనాలబండలో తిరుణాల ఆదివారం అట్టహాసంగా ముగిసింది. - 8లో



భక్తులతో పోటెత్తిన బోయకొండ

కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా విరాజిల్లుతున్న బోయకొండ గంగమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తారు. - 8లో



ఆగని ఏనుగుల దాడులు

పులిచెర్ల మండలంలోని పాళెం పంచాయతీలో ఏనుగుల గుంపు మరోసారి దాడి చేసి పంటలను నాశనం చేశాయి. - 8లో


ఎరువుల నిల్వ (ఫైల్)

ఎరువు.. దడ

ఎరువుల ధరలు ఇలా.. (50 కిలోల బస్తా)

ఎరువురకం	పాతధర (రూ.లల్లో)	కొత్త ధర (రూ.లల్లో)
పొటాష్	1,535	1,800
20-20-013(ఫ్యాక్ట్)	1300	1425
20-20-013(గ్రోమోర్)	1,300	1,350
20-20-013(పీపీఎల్)	1,300	1,400
10-26-26	1,470	1,800
12-32-16	1,470	1,720
16-16-16	1,450	1,600
15-15-15-0-9	1,450	1,600
16-20-0-13	1,250	1,300
24-24-0	1700	1800
14-35-14	1700	1,800
సింగల్ సూపర్ ఫాస్ఫేట్	580	640

రాయితీ ఎరువుల ధరలను సంబంధిత కంపెనీలు అనూహ్యంగా పెంచాయి. బస్తాపై రూ.50 నుంచి రూ.320 వరకు పెంచి రైతులపై భారాన్ని మోపాయి. ఏటా పెరుగుతున్న ధరల కారణంగా అన్నదాతలకు పంటల సాగు శక్తికి మించిన పనిగా మారుతోంది. పెరుగుతున్న ధరలు రైతన్నలను నడ్డి విరుస్తున్నాయి. నానో యూరియా ద్రవ రూపంలో కేంద్రం తీసుకొచ్చింది. కానీ దానిపై రైతులకు సరైన అవగాహన కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైంది. ఏటా సాగు ఖర్చులు రెట్టింపై వ్యవసాయం సంక్షోభంలోకి కూరుకుపోతోంది. ఇప్పటికైన పాలకులు కళ్లు తెరిచి రైతులపై భారం మోపకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

- అమాంతం పెరిగిన ఎరువుల ధరలు
- ఏడాదిలో మూడుసార్లు పెంచిన కంపెనీలు
- బస్తాపై రూ.50 నుంచి రూ.320 వరకు పెంపు
- పెరుగుతున్న ధరలతో రైతుల అవస్థలు
- పక్క రాష్ట్రాలకు పరుగులు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : కూటమి పాలకుల నిర్లక్ష్యంతో అన్నదాత గుండె బరువెక్కుతోంది. గిట్టుబాటు ధర లేక తీవ్రంగా నష్టపోతున్న వారిపై ఎరువుల ధరల పెంపు అదనపు భారాన్ని మోపుతోంది. ప్రకృతికి ఎదురొడ్డి వ్యవసాయం చేస్తున్న జిల్లా రైతాంగానికి పాలకులు ఏమాత్రమూ సాయంగా నిలవలేకపోతున్నారు. వ్యవసాయాన్ని మరింత సంక్షోభంలోకి నెడుతున్నారు. ఇప్పటికే వ్యవసాయ ఖర్చులు పెరిగి అల్లాడిపోతున్న రైతులను ఎరువు ధరలు మరింత భయపెడుతున్నాయి.

వ్యవసాయంలో ప్రధానమైన ఎరువుల ధరలు అమాంతంగా పెరిగాయి. రసాయన ఎరువుల వాడకం తగ్గించి , ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు నామమాత్రం కావడంతో ఎరువుల వాడకం మరింత పెరిగింది. గతంలో ఎరువుల ధరలను పెంచే అధికారం కేంద్ర ప్రభుత్వానికి మాత్రమే ఉండేది. ఉత్పత్తి వ్యయానికి అనుగుణంగా ధరలు పెంచుకునే వెసులుబాటును కేంద్ర ప్రభుత్వం ఫర్టిలైజర్ కంపెనీలకు ఇవ్వడంతో ధరలు ఏడాదిలో రెండు, మూడుసార్లు పెంచేస్తున్నారు. ధరల పెరుగుదలను నియంత్రించే అవకాశం ఉన్నప్పటికీ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకుంటున్న పాపాన పోలేదు. దీంతో కంపెనీలు ఇష్టారాజ్యంగా ధరలు పెంచుకుంటూ పోతున్నాయి. రైతన్నలకు సాగు మరింత భారంగా మారుతోంది.

వైఎస్సార్‌సీపీ హయాంలో మేలు

2014–19 వరకు టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉంది. అప్పట్లో కూడా తోచినప్పుడల్లా ఎరువుల ధరలు పెంచారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక రసాయనిక ఎరువుల ధరలు ఒక్కసారి కూడా ధరలు పెరగలేదు. రైతులకు కావాల్సినంత మేర ఎరువులను రైతు భరోసా కేంద్రాల ద్వారానే అందించేది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలోనే రైతుల నడ్డి విరిచేలా ధరలను పెంచుకుంటూ పోతున్నాయి. ఇక రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువుల పంపిణీకి మంగళం పాడుతోంది. దీంతో రైతులు అవస్థలు పడుతున్నారు.

సాగు విస్తీర్ణం ఇలా..

జిల్లా ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 1.80 లక్షల హెక్టార్లు కాగా సరైన సమయంలో వర్షాలు కురవక ఇప్పటి దాకా కేవలం 50 నుంచి 70 వేల హెక్టార్లల్లో వివిధ పంటలు సాగులోకి వచ్చాయి. అందులో వేరుశనగ 3194 హెక్టార్లు, వరి 2747, కంది 135.0, చెరకు 2284, రాగి 113.5, టమాట 4,000, వివిధ రకాల కూరగాయల పంటలు 30 వేల హెక్టార్లతో పాటు ఇంకా పలు రకాల పంటలు, పండ్ల తోటలు సాగులో ఉన్నాయి.

అవసరానికి సరిపడా లేక

జిల్లాలో యూరియా, డీఏపీ ఎరువులు అవసరానికి సరిపడా లభించలేదు. ఒకవేళ దొరికినా అధిక ధరలతో పాటు వేరే ఎరువులు కూడా కొనాలనే ఒత్తిడి జిల్లా రైతాంగం ఎదుర్కొంటోంది. అవసరానికి సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఒకసారి, కేంద్రం... రాష్ట్రానికి నెలవారీగా ఇవ్వాల్సిన కోటా ఎరువులు పంపడం లేదని ఇంకోసారి.. ఇలా కూటమి సర్కారు పొంతన లేని ప్రకటనలు చేయడం రైతులను గందరగోళానికి గురిచేస్తోంది. వాస్తవానికి కేంద్రం నుంచి ఏపీకి రావాల్సిన ఎరువులను తెప్పించుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలమవుతోందని టీడీపీ నేతలే కొందరు బహిరంగంగా విమర్శిస్తున్నారు.

పక్కరాష్ట్రాలకు పరుగు

జిల్లాలో లభ్యమవుతున్న ఎరువుల ధరలు, నాణ్యత లోపం, సరఫరా తదితర విషయాలు రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. తద్వారా రైతులు ఎరువుల కోసం పక్క రాష్ట్రాల వైపు చూస్తున్నారు. పలమనేరు, కుప్పం, వీ.కోట, రామకుప్పం, శాంతిపురం, పంగనూరు తదితర ప్రాంతాల్లోని రైతులు ఎరువుల కోసం కర్ణాటకను ఆశ్రయిస్తున్నారు. బంగారుపాళ్యం, యాదమరి, చిత్తూరు, కార్వేటినగరం, నగరి, ఎస్‌ఆర్‌పురం, జీడీ నెల్లూరు, పాలసముద్రం తదితర మండలాల్లోని రైతులు తమిళనాడులోని వేలూరు, కాటాప్పడి, పరదరామి, పొన్నై, సోలింగరం తదితర ప్రాంతాలకు వెళుతున్నారు.

పెంచిన ధరలు

ఏటా ఖరీఫ్‌తో పాటు రబీ సీజన్‌లో పంటల సాగుకు డీఏపీ, కాంప్లెక్స్, సూపర్ పాస్ఫేట్ వంటి ఎరువుల వాడకం పెరుగుతోంది. మోతాదుకు మించి రసాయనిక ఎరువుల వినియోగంతో పెట్టుబడి పెరిగింది. ఫలితంగా దిగుబడి ఎంత వచ్చినా రైతుకు పెద్దగా ప్రయోజనం కనిపించడం లేదు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం 50 కిలోల ఎరువుల బస్తాపై రూ.50 నుంచి రూ.320 వరకు పెంచింది. జిల్లాలో ఒక్కో మండలంలో సరాసరిన రసాయనిక ఎరువులు ఏడాదికి 3,500 టన్నులు వినియోగిస్తారని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. టన్నుపై కనిష్టంగా రూ.1,000 నుంచి గరిష్టంగా రూ.4 వేల వరకూ ఎరువుల ధరలు పెరగడం అన్నదాతలను ఆందోళనకు గురిచేస్తోంది. ఈ క్రమంలో చాలా మంది రైతులు ఫర్టిలైజర్ దుకాణాల వద్ద అప్పు పెడుతున్నారు. పంట వచ్చాక వడ్డీతో సహా తీర్చాల్సి ఉండటంతో వచ్చిన ఆదాయం ఎరువుల అప్పులకే సరిపోతోంది.

ధరలు తగ్గించాలి



ఏ పంట పండించాలన్నా పెట్టుబడి వేధిస్తోంది. బ్యాంకులకు రుణం కోసం వెళ్తే ఇచ్చే పరిస్థితి లేదు. ఇచ్చినా తిరిగీ కట్టే పరిస్థితులు ఉండడం లేదు. పంట దిగుబడి వచ్చినా ధరలు లేక నష్టాలు చవిచూస్తున్నాం. ఇందుకు నిదర్శనమే మామిడి విపత్తు. ఇప్పుడు అప్పా..సప్పా చేసి వరి పండించా. ముఖ్యంగా ఎరువులు దొరకడం కష్టంగా ఉంది. ఇప్పుడు ఎరువుల ధరలు పెరిగాయి. ఇలాగైతే పంట పండించడం మానుకోవాల్సిందే. ఎరువుల ధరలు తగ్గించాలి.

– ప్రభాకర్‌రెడ్డి, ఐరాల మండలం

ఎరువుల కోసం తమిళనాడుకు



నేను 2 ఎకరాలో ఆరటి, ఎకరాలో వరి వేశా. ఈ వర్షానికి వరి మొత్తం నేల మట్టమైంది. ఏ పంట పండించినా చేతికి చిల్లిగవ్వ మిగలడం లేదు. కష్టాల్లోనే మిగిలిపోతున్నాం. కర్షకుల కష్టాలు తెలియకుండా ఎరువుల రేట్లను పెంచుకుంటూ పోతే ఎలా. ఇది మంచిది కాదు. రైతులను బతికించాలి. ఎరువుల ధరలను తగ్గించాలి. ఈ దెబ్బతో చాలా మంది రైతులు ఎరువుల కోసం తమిళనాడుకు వెళుతున్నారు. నేను కూడా అక్కడికి వెళ్లాల్సిందే.

– కన్నయ్యనాయుడు, జంగాలపల్లి, చిత్తూరు మండలం

న్యూస్‌రీల్

నేడు రాహుకేతు పూజలు

బంగారుపాళెం: మండలంలోని మొగిలి శివాలయంలో సోమవారం రాహుకేతు పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ మునిరాజ తెలిపారు. ఈసందర్భంగా ఉదయం స్వయంభు శ్రీమొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అనంతరం రాహుకాల సమయం ఉదయం 7.30 గంటల నుంచి 9 గంటల మధ్య రాహు, కేతు, సర్ప దోష నివారణ పూజలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు దోషనివారణ పూజలు చేసుకోవాలని కోరారు.

నేడు, రేపు విద్యుత్ అంతరాయం

చిత్తూరు కార్పొరేషన్: జిల్లా పరిధిలోని 400 కేవీ, జీడీనెల్లూరు మండలం మహాదేవమంగళంలోని సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతుల కారణంగా రెండు రోజుల పాటు విద్యుత్ అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఈఈ మునిచంద్ర తెలిపారు. అక్కడ నుంచి సరఫరా మనకు వస్తుందన్నారు. సోమ, మంగళవారం రోజున చిత్తూరు, పూతలపట్టు పరిసర ప్రాంతాల్లో ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. సరఫరాలో అంతరాయం లేకుండా ఉండేందుకు ప్రత్యామ్నాయంగా మరో లైన్ నుంచి సరఫరా ఏర్పాటు చేశామన్నారు. ఒకవేళ సరఫరా లేకపోతే మార్పును వినియోగదారులు గమనించాలని కోరారు.

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 18వ తేదీన కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ వెల్లడించారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సమావేశానికి అన్ని శాఖల జిల్లా అధికారులు తప్పక హాజరు కావాలన్నారు. గైర్హాజరయ్యే వారిపై శాఖాపరంగా చర్యలుంటాయని కలెక్టర్ హెచ్చరించారు.

పోలీసు కార్యాలయంలో ..

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని వన్‌టౌన్ పక్కన ఉన్న ఆర్మ్డు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే) కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ మణికంఠ చందోలు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు వారి సమస్యలు ఏవైనా ఉంటే తనను నేరుగా కలిసి మాట్లాడవచ్చన్నారు. ఉదయం 10.30 గంటల నుంచి ఇక్కడ ఇచ్చే వినతులు, ఫిర్యాదులను పరిశీలించి చర్యలు చేపడుతామని ఎస్పీ తెలిపారు.

18 మండలాల్లో వర్షపాతం

చిత్తూరు కలెక్టరేట్: జిల్లావ్యాప్తంగా ఆదివారం అక్కడక్కడా వర్షాలు కురిశాయి. జిల్లావ్యాప్తంగా ఈ నెల 17వ తేదీన 18 మండలాల పరిధిలో 5.2 మి.మీ సగటున వర్షపాతం నమోదైంది. పెనుమూరు మండలంలో 26.0, గుడుపల్లిలో 26.0, శ్రీరంగరాజపురంలో 14.2, రొంపిచెర్లలో 11.2, కుప్పం 9.0, రామకుప్పం 8.8, సోమలలో 8.4, నింద్రలో 8.2, పులిచెర్లలో 8.0, కార్వేటినగరంలో 7.4, విజయపురంలో 6.2, పూతలపట్టులో 5.6, వెదురుకుప్పంలో 5.4, ఐరాలలో 5.0, నగరిలో 4.6, సదుంలో 4.8, బైరెడ్డిపల్లిలో 1.4, వి.కోటలో 1.0 మి.మీ వర్షపాతం నమోదైంది.

గుడివంక ఆలయానికి భారీ ఆదాయం


హుండీ కానుకలను లెక్కిస్తున్న పాలక మండలి సభ్యులు

గుడుపల్లె: గుడివంక శ్రీవల్లీదేవ సేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయానికి రూ.23.94 లక్షల ఆదాయం వచ్చిందని ఈఓ కమలాకరన్ తెలిపారు. ఆదివారం ఆలయంలో పాలకమండలి కమిటీ సభ్యులు, దేవదాయశాఖ అధికారులు, గ్రామ పెద్దల సమక్షంలో హుండీ కానుకలను లెక్కించారు. వారం రోజుల పాటు జరిగిన బ్రహ్మోత్సవాల ద్వారా హుండీ కానుకల ద్వారా రూ.11.91 లక్షలు, లడ్డు ప్రసాదం విక్రయాల ద్వారా రూ.5.55 లక్షలు, తలనీలాలు రూ.2.5 లక్షలు, అంగళ్ల గేటు రూ.1.34 లక్షలు, కోళ్ల గొర్రెలు ఇతరత్రా వాటికి రూ.57,850, స్వామి వారి ఉత్సవాల టోకెన్ల ద్వారా రూ.1.62 లక్షలు, చందాల రూపంలో రూ.88,530 వచ్చినట్లు ఈఓ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్‌రెడ్డి, టీఎం బాబునాయుడు, ఆలయ పాలకులు ఎంఎల్ రాజగోపాల్, వెంకటేష్‌గౌడు, అర్చకులు వీరోఖరయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

అరచేతిని అడ్డుపెట్టి సూర్యున్ని ఆపలేరు

- జూనియర్ ఎన్టీఆర్ అంతర్జాతీయ స్థాయిలో అవార్డులు సొంతం చేసుకుంటున్నాడు
- ఎవరి సినిమా అయినా బాగుంటేనే చూస్తారు
- బాగలేని సినిమాను ఎవరూ ఆడించలేరు
- హరిహరవీరమల్లుతో అది నిరూపితమైంది
- మాజీ మంత్రి ఆర్కే రోజా


మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆర్కే రోజా

నగరి : అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ జూనియర్ ఎన్టీఆర్‌పై చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపడంపై మాజీ మంత్రి ఆర్కే రోజా స్పందించారు. ఆదివారం మీడియాతో ఆమె మాట్లాడుతూ టీడీపీ ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టారు. తెలుగు చలనచిత్ర పరిశ్రమ, జూనియర్ ఎన్టీఆర్ కుటుంబం అంటే తెలుగుదేశం పార్టీకి ఎప్పటికీ చిన్నచూపే అన్నారు. జూనియర్ ఎన్టీఆర్ సినిమా ప్రదర్శనను ఆపాలనుకోవడం అంటే అరచేతిని అడ్డుపెట్టి సూర్యుడిని ఆపినట్టే అవుతుందని రోజా వ్యాఖ్యానించారు. జూనియర్ ఎన్టీఆర్ సినిమాలను ప్రతి ఒక్కరూ ఇష్టపడతారని, ప్రజల్లో మాస్ ఇమేజ్ ఉన్న హీరో సినిమాను అడ్డుకోవాలనుకోవడం హాస్యాస్పదమన్నారు. సినిమా బాగుంటే ఎవరూ అడ్డుకోలేరని, బాగోలేకపోతే ఎవరూ దాన్ని ఆడించలేరని స్పష్టం చేశారు. ఈ విషయం ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హీరోగా నటించిన హరిహర వీరమల్లు సినిమాతో నిరూపితమైందన్నారు. టీడీపీ–జనసేన ఎమ్మెల్యేలు తలకిందులుగా తపస్సు చేసి, టికెట్లు ఫ్రీగా ఇచ్చినా కూడా హరిహర వీరమల్లు సినిమాను ఆడించలేకపోయారని గుర్తుచేశారు. సినిమా ఫంక్షన్లల్లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని తిట్టడం, సవాళ్లు చేయడం వంటివి జరిగితే గేమ్ ఛేంజర్ గానీ, హరిహరవీరమల్లు లాంటి సినిమాలు ఏమయ్యాయో మనం కళ్లారా చూశామన్నారు. జూనియర్ ఎన్టీఆర్ అసలు రాజకీయాల్లో లేడని, ఆయన సినిమాలు చేసుకుంటున్నాడని, ఆయన అంతర్జాతీయ స్థాయిలో అవార్డులు సొంతం చేసుకుంటున్న విషయం మనం చూస్తున్నామన్నారు.

ఎన్టీఆర్ ఎదుగుదలను చూసి ఓర్వలేక..



దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌కు చంద్రబాబు వెన్నుపోటు పొడిచి టీడీపీని లాక్కున్నారు. ఇప్పుడు ఎన్టీఆర్ వారసత్వ రాజకీయాన్ని, ఎదుగుదలను పూర్తిగా అణగదొక్కేశారు. జూనియర్ ఎన్టీఆర్‌ను చీడపురుగును చూసినట్లు చూస్తున్నారు. పచ్చ బ్యాచ్‌తో జూనియర్ ఎన్టీఆర్‌పై తప్పుడు ప్రచారం చేస్తూ తొక్కేయాలని చూస్తున్నారు.

– ఎంసీ విజయానందరెడ్డి, చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ

ఎన్టీఆర్ బొమ్మను చూస్తే తట్టుకోలేకపోతున్నారు



తెరపై జూనియర్ ఎన్టీఆర్ బొమ్మను చూసి టీడీపీ తట్టుకోలేకపోతోంది. ఇక నేరుగా జూనియర్ ఎన్టీఆర్ కటౌట్‌ను చూస్తే వీళ్లు తట్టుకోగలరా.? ఆయన అభిమానుల ముందర నిలబడగలరా? ఎన్టీఆర్ సినిమాలు చేసుకుంటూ..రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. ఆయనకు వస్తున్న ఆదరణ చూసి టీడీపీ ఓర్వలేకపోతోంది.

– సునీల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే, పూతలపట్టు

గంగమ్మతల్లి ఆశీస్సులు అందాలి


పుంగనూరు : బాగేపల్లె గంగమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పుంగనూరు: గంగమ్మతల్లి ఆశీస్సులు అందరికీ అందించి, అందరూ బాగుండేలా చూడాలని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రార్థించారు. ఆదివారం సాయంత్రం మండలంలోని బాగేపల్లె గ్రామంలో గ్రామస్తులు నిర్మిస్తున్న నూతన గంగమ్మ ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పెద్దిరెడ్డికి మంగళ హారతులు పట్టి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులతో సరదాగా గడిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు భక్తిమార్గంలో పయణిస్తున్నారని కొనియాడారు. ప్రతి గ్రామంలోనూ రామాలయాలు, గంగమ్మ ఆలయాలు నిర్మించి, ఆధ్యాత్మికత వైపు పల్లెలు పయణిస్తుండడం అభినందనీయమన్నారు. గంగమ్మ తల్లి ప్రజలందరినీ చల్లగా చూడాలని, సకాలంలో వర్షాలు కురిసి, పంటలు పండి ప్రజలంతా అభివృద్ధి చెందాలని ప్రార్థించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రామమోహన్‌రెడ్డి, రాజారెడ్డి, జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ప్యాక్‌హౌస్.. సబ్సిడీ మిస్

చెర్లోపల్లిలో నిర్మించిన ప్యాక్ హౌస్ భవనం



మూలిగే నక్కపై తాటిపండు పడిన చందాన మామిడి రైతుల పరిస్థితి మరింత దయనీయంగా తయారైంది. ఈ ఏడు తీవ్ర ధరాఘాతంతో ఆర్థికంగా చితికిపోయిన మామిడి రైతులకు ప్యాక్ హౌస్ నిర్మాణాల రూపంలో మరో ఎదురుదెబ్బ తగిలింది. నిర్మాణాలు పూర్తి చేసి 8 నెలలు గడుస్తున్నా ఏ ఒక్క రైతుకు సబ్సిడీ మొత్తం అందలేదు. దీంతో మామిడి రైతులు ప్రస్తుత కూటమి ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- మామిడికి ధర కల్పించడంలో చేతులెత్తేసిన కూటమి ప్రభుత్వం
- ఆర్థికంగా చితికిపోయిన రైతులు
- ఇప్పుడు ప్యాక్ హౌస్ నిర్మాణాలతో మరింత ఆర్థిక భారం
- సబ్సిడీ కోసం ఎదురు చూపులు
- నిధులు జమ చేయడంలో ప్రభుత్వ నిర్లక్ష్యం




శాంతినగర్‌లో నిర్మించిన ప్యాక్ హౌస్ భవనం


ప్యాక్ హౌస్‌లో ఏర్పాటు చేసిన సామగ్రి

పుత్తూరు: ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మామిడి రైతులు ప్రభుత్వ హామీని నమ్మి ప్యాక్ హౌస్‌లను నిర్మించుకుని ఆర్థికంగా మరింత కూరుకుపోయారు. కూటమి ప్రభుత్వం ప్యాక్ హౌస్ నిర్మాణాలకు అనుమతిస్తూ 50 శాతం సబ్సిడీ ఇస్తామని ఆర్భాటంగా ప్రకటించింది. దీంతో సబ్సిడీ అందుతుందనే నమ్మకంతో రైతులు నిర్మాణాలు చేపట్టారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1.8 లక్షల హెక్టార్లలో మమాడి తోటలు విస్తరించి ఉన్నాయి. ఇందులో తోతాపురి దాదాపు 67 వేల హెక్టార్లలో సాగవుతోంది. ఏటా మంచి దిగుబడినిచ్చే తోతాపురి దిగుబడిని రైతులు అత్యధికంగా జ్యూస్ ఫ్యాక్టరీలకు తరలిస్తుంటారు. అయితే పక్వానికి వచ్చిన కాయలను రైతులు గ్రేడింగ్ చేసుకుని మంచి రేటుకు అమ్ముకునేందుకు వీలుగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్యాక్‌హౌస్ నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. సకాలంలో సబ్సిడీ మొత్తాలను అందించి రైతులకు ఆర్థిక తోడ్పాటునందించింది. అయితే కూటమి ప్రభుత్వంలో ప్యాక్ హౌస్‌లు నిర్మించుకున్న రైతులు సబ్సిడీ అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ప్యాక్ హౌస్ అంటే ?

ఎంఐడీహెచ్– మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఆఫ్ హార్టికల్చర్ (ఉద్యానవన సమగ్రాభివృద్ధి మిషన్) పేరిట కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంయుక్త భాగస్వామ్యంతో అమలు చేస్తున్న పథకమే ప్యాక్ హౌస్. మామిడి రైతులు పంట దిగుబడి సమయంలో కాయలను గ్రేడింగ్ చేసుకోవడం, నిల్వ ఉంచుకోవడానికి వీలుగా తోటల్లోనే ఏర్పాటు చేసుకునే చిన్నపాటి షెడ్డునే ప్యాక్ హౌస్ అంటారు. వీటిని గ్రామాల్లోని మామిడి తోటల్లో ఏర్పాటు చేసుకోవడానికి అనుమతిస్తారు. 20 అడుగుల వెడల్పు, 30 అడుగుల పొడవుతో, రేకుల పైకప్పుతో నిర్మాణం చేపట్టాలి. వీటిలో సాధారణంగా పంట దిగుబడి సమయంలో రోజువారిగా నాలుగు నుంచి ఐదు టన్నుల మేర నిర్వహణ సామర్థ్యం కలిగి ఉంటుంది.

50 శాతం సబ్సిడీ

ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లోని మామిడి తోటల్లో ఏర్పాటు చేసే ప్యాక్ హౌస్ నిర్మాణాలకు 50 శాతం సబ్సిడీతో ప్రభుత్వం ఆర్థిక తోడ్పాటును అందిస్తోంది. ఒక్కో ప్యాక్ హౌస్ నిర్మాణానికి ప్రభుత్వ అంచనా వ్యయం రూ.4 లక్షలు. ఇందులో 50 శాతం సబ్సిడీ అంటే రూ.2 లక్షల ఆర్థిక తోడ్పాటును ప్రభుత్వం అందించాల్సి ఉంది. ఈ సబ్సిడీలో కేంద్ర ప్రభుత్వం 60 శాతం చెల్లిస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం వాటాతో చెల్లించాల్సి ఉంది.

ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాం



మా ప్రాజెక్టు పూర్తి చేసి 4 నెలలైంది. రూ.4 లక్షల అంచనా వ్యయంతో చేపట్టగా రూ.4.65 లక్షలు ఖర్చు అయింది. ఇందుకు సంబంధించి రిపోర్టు ప్రభుత్వానికి అందజేసి నెలలు గడుస్తున్నా ఇంకా సబ్సిడీ మొత్తం అందలేదు. సబ్సిడీ వస్తుందని కొంత అప్పు చేసి మరీ నిర్మాణం చేపట్టాం. ప్రస్తుతం ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాం.

– ఎస్.ఉషారాణి, మహిళా రైతు, శాంతినగర్, పుత్తూరు

బడ్జెట్ రిలీజ్ అయింది



ప్రభుత్వం జిల్లాలో మొత్తం 30 ప్యాక్ హౌస్ నిర్మాణాలను మంజూరు చేసింది. ఇందుకోసం ఇటీవలే బడ్జెట్ రిలీజ్ అయింది. అయితే ప్యాక్ హౌస్ నిర్మాణాలు అసంపూర్తిగా ఉండడంతో సబ్సిడీ రిలీజ్ చేయడం లేదు. ప్యాక్‌హౌస్ నిర్మాణం అంటే ఒక్క షెడ్ మాత్రమే కాదు. అందులో రెండు ఫ్యాన్లు, ఐదు లైట్లు, గ్రేడింగ్ టేబుల్, వేవింగ్ మిషన్, ట్రేలు వంటి వస్తువులు సైతం ఏర్పాటు చేయాల్సి ఉంది. అన్నీ ఏర్పాటు చేస్తే సబ్సిడీ రిలీజ్ చేయడం జరుగుతుంది.

– బి.దశరథరామిరెడ్డి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి, తిరుపతి.

క్లుప్తంగా

భక్తులతో పోటెత్తిన బోయకొండ



ఆలయంలో భక్తుల రద్దీ

చౌడేపల్లి: కోరిన కోర్కెలు తీర్చుతూ భక్తులపాలిట వరాలిచ్చే ఆరాధ్య దైవంగా విరాజిల్లుతున్న బోయకొండ గంగమ్మ ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. భక్తులు అధిక సంఖ్యలో బోయకొండకు చేరుకుని అమ్మవారికి విశిష్ట పూజలు నిర్వహించారు. భక్తుల రద్దీ గణనీయంగా పెరగడంతో క్యూలైన్లు అన్నీ కిక్కిరిసి పోయాయి. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు అమ్మవారి దర్శనం కోసం తరలివచ్చారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేక పూలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కోరిన కోర్కెలు తీరిన భక్తులు పిండి, నూనెదీపాలు, మేళతాళాల నడుమ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. ఆలయ ఈఓ ఏకాంబరం పర్యవేక్షణలో అమ్మవారి తీర్థప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు.

20న విద్యుత్ గ్రీవెన్స్

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం బుధవారం విద్యుత్ గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించనున్నారు. స్థానిక గాంధీ రోడ్డులోని ట్రాన్స్‌కో అర్బన్ ఈఈ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని ఈఈ మునిచంద్ర తెలిపారు. చిత్తూరు, పూతలపట్టు వినియోగదారులు సమస్యలను రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలని వివరించారు.

అటవీ ప్రాంతాల్లోకి వెళ్లొద్దు



ఆమినిగుంట అడవుల్లోకి వెళ్లవద్దని సూచిస్తున్న సెక్షన్ ఆఫీసర్ ఇంద్రాణి

చౌడేపల్లి: అంకాలమ్మ కొండ సమీపంలోని అటవీ ప్రాంతాల్లోకి ప్రజలు, పశువులు, గొర్రెలు, మేకల కాపరులు వెళ్లొద్దంటూ సోమల సెక్షన్ ఆఫీసర్ ఇంద్రాణి హెచ్చరికలు చేశారు. ఆదివారం ఆమె ఆమినిగుంటలో ప్రజలకు అవగాహన కల్పించారు. గత రెండు రోజుల కిందట గొర్రెల మందపై చిరుతపులి దాడి చేసి గొర్రెలను గాయపరిచిన ఘటనపై అటవీశాఖ సిబ్బంది అప్రమత్తమయ్యారు. ప్రజలు ఎవరూ అడవుల్లోకి వెళ్లరాదని హెచ్చరించారు. కొండ చుట్టూ పంటలు సాగుచేసిన రైతులు ఒంటరిగా వెళ్లరాదని, అడవి జంతువులు కనిపిస్తే బిగ్గరగా కేకలు వేయాలని సూచించారు. చిరుతపులి ఇటీవల కాలంలో వరుసగా పశువులు, గొర్రెలపై దాడి చేసిందని గుర్తుచేశారు. ఎలాంటి ఘటనలు తలెత్తినా వెంటనే ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఆమె వెంట ఎఫ్‌బీఓలు ప్రభాకర్, రామచంద్ర తదితరులు ఉన్నారు.

ప్రయాస్.. పరిశోధనలకు చాన్స్

నూతన ఆవిష్కరణల వైపు విద్యార్థుల దృష్టి మరల్చేందుకు, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి కేంద్రం ప్రయాస్ పథకాన్ని అమలు చేస్తోంది. ఆసక్తి గల విద్యార్థుల నుంచి ప్రాజెక్టు ప్రతిపాదనలను ఆహ్వానిస్తోంది. ఈ పథకాన్ని జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో చదువుతున్న 9 నుంచి 11 వ తరగతి వరకు విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని విద్యాశాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 30వ తేదీలోపు ప్రతిపాదనలను దరఖాస్తు చేసేలా చర్యలు చేపడుతున్నారు.

- విద్యార్థుల నుంచి పరిశోధన ప్రాజెక్టులకు ఆహ్వానం
- 9 నుంచి 11వ తరగతి వరకు చదివే విద్యార్థులు అర్హులు
- శాస్త్రీయత, దృక్పథాన్ని పెంపే లక్ష్యం
- ఎంపికైతే రూ.50 వేలు మంజూరు
- సద్వినియోగం చేసుకోవాలంటున్న అధికారులు



ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 9 వ తరగతి విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్ : నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ) సంస్థ ప్రమోషన్ ఆఫ్ రీసెర్చ్ యాటిట్యూడ్ అమాంగ్ యంగ్ అండ్ యాస్పైరింగ్ స్టూడెంట్స్ (ప్రయాస్) పథకాన్ని ఎప్పటి నుంచో అమలు చేస్తోంది. అందులో పరిశోధన ప్రాజెక్టు ప్రతిపాదనలను ఆహ్వానించేందుకు దరఖాస్తుల స్వీకరణను ప్రారంభించింది. జిల్లావ్యాప్తంగా అన్ని యాజమాన్యాలకు సంబంధించి పాఠశాలలు, జూనియర్ కళాశాలలు 6,426 ఉన్నాయి. జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో 9 వ తరగతి నుంచి 11 వ తరగతి వరకు చదివే విద్యార్థులు ప్రయాస్ పథకం అర్హులు. జిల్లాలో 9వ తరగతి నుంచి 11వ తరగతి వరకు ఈ విద్యాసంవత్సరంలో 42 వేల వరకు విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఒక పాఠశాల నుంచి ఒకరు లేదా ఇద్దరు విద్యార్థులు ప్రాజెక్టు ప్రతిపాదనలను పంపవచ్చు. అయితే ఒక పాఠశాల నుంచి ఒక దరఖాస్తును మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు. ఆన్‌లైన్ విధానంలో ఈ నెల 30వ తేదీలోపు ప్రతిపాదనల దరఖాస్తులను పంపేందుకు అవకాశం కల్పించారు. జిల్లా విద్యాశాఖ అధికారులు క్షేత్రస్థాయిలోని విద్యార్థులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నారు. ఇలా దరఖాస్తులు చేసుకునే విద్యార్థుల ప్రతిపాదనలను సెప్టెంబర్ 15 లోగా పరిశీలన చేసి అక్టోబర్ 15వ తేదీన విజేతలను కేంద్రం ప్రకటించనుంది.

జిల్లాలోని స్కూళ్లు, కళాశాలల సమాచారం

కేటగిరీ	స్కూళ్ల సంఖ్య	విద్యార్థుల సంఖ్య
ప్రాథమిక	4,247	59,067
ప్రాథమికోన్నత	738	42,380
ఉన్నత	1,203	3,037
జూనియర్‌కాలేజీలు	238	27,700
మొత్తం	6,426	1,59,454

ముఖ్యమైన తేదీలు

దరఖాస్తు చేసేందుకు ఆఖరి తేదీ	ఆగస్టు 30
దరఖాస్తుల స్క్రీనింగ్	సెప్టెంబర్ 15
జ్యూరీ ఎంపిక గడువు	సెప్టెంబర్ 30
ఫలితాల ప్రకటన	అక్టోబర్ 15
ఎంపికయ్యే ప్రాజెక్టుల ప్రారంభం	అక్టోబర్ 16
ప్రాజెక్టు ముగింపు తేదీ	అక్టోబర్ 16-2026
రిపోర్ట్ సబ్మిషన్ తేదీ	అక్టోబర్ 20-2026

అర్హతలు - నిబంధనలు ఇవే..

ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 9, 10 తరగతులు, ఇంటర్మీడియెట్ ఫస్టియర్ చదువుతున్న అన్ని యాజమాన్యాల పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. ఒక పాఠశాల నుంచి ఒకరు లేదా ఇద్దరు విద్యార్థులు పాల్గొనవచ్చు. పాఠశాలల్లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ లేదా గణితం బోధించే పీజీటీ/టీజీటీ ఉపాధ్యాయుడు, ఏదైనా ఒక ఉన్నత విద్యా సంస్థ, పరిశోధన సంస్థ నిపుణుడితో కలిసి పరిశోధన ప్రాజెక్టును సమర్పించాలి.

- ఒక పాఠశాల నుంచి ఒక దరఖాస్తును మాత్రమే పరిశీలిస్తారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునే వీలుంది. పూర్తి సమాచారాన్ని ఎన్‌సీఈఆర్‌టీ అధికారిక వెబ్‌సైట్‌లో పరిశీలించవచ్చు.
- విద్యార్థులకు సైన్స్ ఉపాధ్యాయుడు గైడ్ టీచర్‌గా వ్యవహరిస్తారు. ఉన్నత విద్యాసంస్థల సైన్స్ సబ్జెక్ట్ నిపుణుల నుంచి సాంకేతిక సహకారం, మార్గదర్శకత్వాన్ని విద్యార్థులు పొందవచ్చు.



ప్రయాస్ పథకం వెబ్‌సైట్ చిత్రం

విద్యార్థుల మేధోశక్తిని వెలికితీసేందుకు..



విద్యార్థుల్లో దాగి ఉన్న మేధోశక్తిని వెలికితీసేందుకు కేంద్రం ప్రయాస్ పథకాన్ని అమలు చేస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ప్రయోగాల పట్ల మంచి ఆసక్తి చూపుతుంటారు. స్థానికంగా నెలకొన్న సమస్యలకు పరిష్కారం చూపేలా ప్రాజెక్టులను రూపొందించాలి. అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థుల చేత ఈ నెల 30వ తేదీలోపు దరఖాస్తులు చేయించాలని ఆదేశించాం. ప్రయాస్‌ను సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని జిల్లా విద్యాశాఖ అధికారులను ఆదేశించాం

– సుమిత్ కుమార్ గాంధీ, కలెక్టర్, చిత్తూరు.

మంచి ప్రాజెక్టులను ఎంపిక చేసుకునేలా..



ప్రయాస్ పథకానికి మంచి ప్రాజెక్టులను ఎంపిక చేసుకునేలా చర్యలు చేపడుతున్నాం. ప్రతి పాఠశాల నుంచి విద్యార్థులు ప్రాజెక్టుల రూపకల్పనలో భాగస్వాములు అయ్యే విధంగా సైన్స్ ఉపాధ్యాయులు చర్యలు చేపట్టాలని ఇప్పటికే ఆదేశించాం. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు మంచి ప్రాజెక్టులను రూపొందించి గతంలో జాతీయ స్థాయి వరకు వెళ్లారు. ఇదే స్ఫూర్తితో ప్రయాస్ పథకంలో ఎంపికయ్యేలా చర్యలు చేపడుతున్నాం.

– వరలక్ష్మి, డీఈఓ, చిత్తూరు

ఆడికృత్తికకు పుట్టింటికి వచ్చి..



మృతిచెందిన పూజ

శ్రీరంగరాజపురం : ఆడికృత్తిక పండుగకు పుట్టింటికి వచ్చిన ఓ మహిళ గుండెపోటుతో మృతి చెందిన సంఘటన ఆదివారం శ్రీరంగరాజపురం మండలంలో వెలుగు చూసింది. స్థానికుల కథనం మేరకు.. పాతపాళ్యం గ్రామానికి చెందిన చిన్నస్వామి చివరి కుమార్తె పూజ (30)ను యాదమరి మండలం పరదరామి గ్రామానికి చెందిన వ్యక్తికి ఇచ్చి పెళ్లి చేశారు. వీరికి ముగ్గురు సంతానం. అయితే పూజ భర్త ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. ఆడికృత్తిక సందర్భంగా పూజ తన ముగ్గురు పిల్లలను తీసుకుని పాతపాళ్యం గ్రామానికి వచ్చింది. ఆదివారం తమ పొలం వద్దకు వెళ్తుండగా మార్గమధ్యలో గుండెపోటు రావడంతో కింద పడిపోవడంతో స్థానికులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు తెలిపారు. తల్లిదండ్రులను కోల్పోయిన ముగ్గురు పిల్లలను చూసి గ్రామస్తులు బోరున విలపించారు.

ఆగని ఏనుగుల దాడులు

పులిచెర్ల(కల్లూరు): పులిచెర్ల మండలంలోని పాళెం పంచాయతీలో ఆదివారం తెల్లవారుజామున పంట పొలాలపై ఏనుగుల గుంపు దాడి చేసి పంటలను నాశనం చేశాయి. పంచాయతీలోని కోటపల్లె, జూపల్లె, పాళెం గ్రామాల్లోని సమీప భూముల్లో ఏనుగులు ప్రవేశించి మామిడి కొమ్మలను విరిచేశాయి. అలాగే కొబ్బరి, అరటి చెట్లను కూడా ధ్వంసం చేశాయి. పరిసర అటవీ ప్రాంతంలోని చింతలవంకలో పగటి పూట తిష్ట వేసిన ఏనుగులు రాత్రి పూట పంట పొలాలపై పడి నాశనం చేస్తున్నాయి. దీంతో ఏనుగుల భయానికి రైతులు పొలాల్లో పంటలు సాగు చేయలేక బీడుగా వదిలేస్తున్నారు.

అక్రమ కేసులకు భయపడేది లేదు



సదుం: అయ్యప్పస్వామి ఆలయంలో జరిగిన పూజల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సదుం: రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని అక్రమంగా అరెస్టు చేశారని, ఇలాంటి వాటికి తాము భయపడేది లేదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి తెలిపారు. అక్రమ కేసులో అరెస్టు అయిన ఎంపీ విడుదల కావాలని సింగిల్‌విండో మాజీ వైస్ చైర్మన్ రమేశ్ రెడ్డి ఆధ్వర్యంలో ఎర్రాతివారిపల్లె అయ్యప్పస్వామి ఆలయంలో ఆదివారం పూజలు నిర్వహించారు. అనంతరం 116 టెంకాయలను నాయకులు కొట్టారు. వైఎస్సార్‌సీపీ నేతలను వేధించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని పెద్దిరెడ్డి వెల్లడించారు. కేసుల పేరుతో జైళ్లలో ఉంచి కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై ప్రశ్నించే గొంతుకలను నియంత్రించాలని భావిస్తే, అది వారి భ్రమ మాత్రమే అన్నారు. ప్రజావ్యతిరేక ప్రభుత్వ నిర్ణయాలను పార్టీ ఆధ్వర్యంలో ఎదిరించి, ప్రజల పక్షాన పోరాడుతామని స్పష్టం చేశారు. కూటమి పాలనపై ప్రజలు ఈ కొద్దిరోజులకే విసిగి పోయారన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ రెడ్డెప్ప రెడ్డి, వైస్ ఎంపీపీ ధనుంజయ రెడ్డి, పుత్రాజు, రమణ, రమణారెడ్డి, వాసు, ఎంపీటీసీ సభ్యుడు మల్లికార్జున, ఈశ్వర్ రెడ్డి, తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎవరూ అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం



నేతలకు అభివాదం చేస్తున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

- గ్రామ కమిటీలను పటిష్టంగా ఏర్పాటు చేయండి
- వైఎస్సార్‌సీపీ నేతలతో మాజీమంత్రి పెద్దిరెడ్డి

చౌడేపల్లి: కూటమి ప్రభుత్వ వైఫల్యాలను గ్రామస్థాయిలోకి తీసుకెళ్లాలని వైఎస్సార్‌సీపీ నేతలకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సూచించారు. ఆదివారం భాగేపల్లెలో కాగతి సర్పంచ్ షంషీర్, కోఆప్షన్ మెంబరు సాధిక్ బాషా, నేతలు బ్రహ్మానందరెడ్డి, నారాయణరెడ్డితో కలిసి మాట్లాడారు. ఎవరూ అధైర్య పడొద్దని.. కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికీ రానున్న రోజుల్లో తగిన ప్రాధాన్యత ఇస్తామని భరోసా ఇచ్చారు. గ్రామ కమిటీలను పటిష్టంగా ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామాల్లో పార్టీ పటిష్టత కోసం కష్టపడి చురుగ్గా పనిచేసే కార్యకర్తలకు గుర్తింపునిచ్చి కమిటీలో స్థానం కేటాయించాలన్నారు. పార్టీ బలోపేతానికి గ్రామస్థాయిలో ఏర్పాటు చేసిన గ్రామ కమిటీ, రైతు, యువత, మహిళా కమిటీల ఆధ్వర్యంలో సమన్వయంతో ఇంటింటా ప్రచారం నిర్వహించి కూటమి మోసాలు, దౌర్జన్యాలను తెలిపి ప్రజలను చైతన్యవంతులను చేయాలని కోరారు. ఆయన వెంట బాబాజాన్, షేర్‌ఖాన్, నరేష్ తదితరులు ఉన్నారు.

టీచర్ల అపరిష్కృత సమస్యలపై వినతి



విద్యాశాఖామంత్రి లోకేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వ టీచర్ల అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ సంఘ నాయకులు ఆదివారం విజయవాడలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన విలేకరులకు పలు అంశాలు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ మెమో 57 ప్రకారం 2003 డీఎస్సీ టీచర్లకు పాత పెన్షన్‌ను అమలు చేయాలని కోరినట్లు తెలిపారు. ఏకీకృత సర్వీస్ రూల్స్ అమలు చేసి అన్ని కేడర్లలో ఉద్యోగోన్నతులు చేపట్టాలన్నారు. 12వ పీఆర్‌సీ కమిటీ, ఐఆర్ ప్రకటన, డీఏల బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల బకాయిల విడుదల ఆలస్యం అవుతోందని త్వరలో మంజూరు చేస్తామని మంత్రి వెల్లడించారన్నారు. తెలుగు మీడియంను సమాంతరంగా కొనసాగించాలన్నారు. ఈ విద్యాసంవత్సరం 10 వ తరగతి పరీక్షలు తెలుగు మీడియంలో రాయాలనుకునే విద్యార్థులకు అవకాశం కల్పిస్తామని మంత్రి వెల్లడించినట్లు తెలిపారు. అనంతరం సెప్టెంబర్ 1న రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల్లో చేపట్టబోయే మై స్కూల్, మై ప్రైడ్ పోస్టర్లను మంత్రి చేతుల మీదుగా ఆవిష్కరింపజేసినట్లు ఆయన వెల్లడించారు.

గ్యాస్ లీకై.. ఇద్దరు మహిళలకు తీవ్రగాయాలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): వంట గ్యాస్ లీకై ఇద్దరు మహిళలకు తీవ్రగాయాలైన ఘటన ఆదివారం బీఎన్ కండ్రిగలో చోటు చేసుకుంది. వివరాలు.. చిత్తూరు మండలం బీఎన్ కండ్రిగ గ్రామానికి చెందిన సుబ్బయ్య శెట్టి కుమార్తె సింధు, కోడలు లత వంట గదిలో గ్యాస్‌ను వెలిగించే క్రమంలో భగ్గుమంది. మంటలకు సింధు, లతకు తీవ్రగాయాలయ్యాయి. కుటుంబసభ్యులు వారిని చీలాపల్లి సీఎంసీకి తీసుకెళ్లారు. సింధు 15 రోజుల కిందట ప్రసవం జరగడంతో పుట్టింటికి వచ్చింది. బిడ్డకు ఎలాంటి ప్రమాదం లేదని గ్రామస్తులు చెబుతున్నారు.

తెప్పపై సుబ్రహ్మణ్యస్వామి విహారం




వళ్లీదేవసేన సమేత స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు, భక్తులకు అన్నదానం



తెప్పపై విహరిస్తున్న వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి

కార్వేటినగరం: ఆడికృత్తిక వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని రెండవ రోజు ఆదివారం స్కంధ పుష్కరిణి సమీపంలోని కుమారగిరిపై వెలసిన వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి వారు శనివారం పురవీధుల్లో విహరించారు. ముందుగా స్వామివారిని పట్టువస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

వేడుకగా సారె సమర్పణ

చాకలివానిగుంట ఎస్టీకాలనీకి చెందిన వారు వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామివారికి ఆనవాయితీ ప్రకారం పట్టువస్త్రాలు, పరిమళ భరిత పుష్పమాలికలను ప్రత్యేక వాయిద్యాల నడుమ నృత్యాలు చేస్తూ ఊరేగింపుగా తీసుకెళ్లి స్వామివారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

కనుల పండువగా కల్యాణోత్సవం

వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి కల్యాణాన్ని వేద పండితులు వేద మంత్రాల నడుమ స్వామివారి శిరస్సుపై ముత్యాల తలంబ్రాలు పోసి నేత్రపర్వంగా చేపట్టారు. అమ్మవారి కల్యాణానికి ఉభయదారులుగా ఎంపీపీ లతాబాలాజీ కుటుంబ సభ్యులు వ్యవహరించారు. రాత్రి స్వామివారిని స్కంధపుష్కరిణిలో తెప్పపై ప్రతిష్ఠించారు. తెప్పపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో ఈఓ కృష్ణనాయక్, రవియాదవ్, రాజశేఖర్, భక్తులు పాల్గొన్నారు.

డీఫార్మసీతో ఉజ్వల భవిష్యత్తు

–రేపు దరఖాస్తులకు చివరి గడువు



డాక్టర్ ద్వారకనాథ్‌రెడ్డి

తిరుపతి సిటీ: ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి డీఫార్మసీ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులకు మంగళవారంతో గడువు ముగయనుందని ప్రిన్సిపల్ డాక్టర్ వై.ద్వారకనాథ్‌రెడ్డి తెలిపారు. డీఫార్మసీ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు వంద శాతం ఉపాధి, ఉద్యోగావకాశాలు ఉంటాయని చెప్పారు. కోర్సులో ప్రవేశం పొంది.. రేషన్ కార్డు, ఇన్‌కమ్ సర్టిఫికెట్ కలిగి ఉన్న పేద విద్యార్థులకు ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్‌లు అందుతాయని తెలిపారు. ఇంటర్ బైపీసీ, ఎంపీసీ చేసిన విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రవేశాలకు సంబంధించి మరిన్ని వివరాల కోసం 99088 57585, 9966761446, 99635 41557 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

వైభవంగా గోకులాష్టమి



ఊరేగుతున్న కల్యాణ వెంకన్న, శ్రీకృష్ణస్వామి

నారాయణవనం : పద్మావతీ సమేత కల్యాణ వేంటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం గోకులాష్టమి పండుగను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువనే సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు సమర్పించారు. తిరుచ్చిపై శ్రీకృష్ణుని కొలువుదీర్చి మాడవీధుల్లో ఊరేగించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామివారు, గోపాలునికి స్నపన తిరుమంజనం జరిపించారు. దేవదేవేరులు, శ్రీకృష్ణస్వామివారిని తిరుచ్చిపై ఊరేగింపుగా పదహారు కాళ్ల మండపానికి వేంచేపు చేశారు. ఈ మేరకు వేడుకగా ఉట్లోత్సవం నిర్వహించారు. యువకులు ఉత్సాహంగా ఉట్టి కొట్టి సందడి చేశారు. అనంతరం ఉత్సవర్లను ఆలయానికి తీసుకువచ్చి ఆస్థానం చేపట్టారు. ఆలయ అధికారి నాగరాజు, ప్రధాన అర్చకులు శ్రీధరభట్టాచార్య, శ్రీనివాసభట్టాచార్య, నరసింహరాఘవ భట్టాచార్య, ఆర్జితం అధికారి భరత్ పాల్గొన్నారు.

రాజనాలబండలో ముగిసిన తిరుణాల

- ప్రత్యేక పూజలందుకున్న వీరాంజనేయ స్వామి
- తిరుణాలకు పోటెత్తిన భక్తులు





ప్రత్యేక పూజలందుకుంటున్న వీరాంజనేయస్వామి, పోకుమాను ఎక్కుతున్న యువకులు, దేవరెద్దులను తీసుకొస్తున్న దృశ్యం

చౌడేపల్లి: సత్యప్రమాణాలకు నిలయమైన రాజనాలబండ శ్రీ వీరాంజనేయస్వామి ఆలయ తిరుణాల అట్టహాసంగా ముగిసింది. తొలుత రాజనాలబండకు సమీపంలోని కొత్తగూబలవారిపల్లె, దాసరయ్యగారిపల్లె, పెద్దూరు, ఉటూరు గ్రామాలకు చెందిన దేవరెద్దులతో గ్రామపెద్దలు మేళతాళాల నడుమ రాజనాలబండకు చేరుకున్నారు. కొలింపల్లె గ్రామం నుంచి గ్రామదేవత బోయకొండ గంగమ్మ అమ్మవారి ఉత్సవమూర్తితో కలసి ఊరేగింపుగా కోలాటలు, చెక్కభజనలు, పిల్లనగ్రోవుల గానామృతంతో పాటు కత్తిసాముతో నృత్యం చేస్తూ చేరుకుని సంప్రదాయబద్ధంగా బండారు పంపకం జరిగింది. అక్కడి నుంచి దేవరెద్దులతో బోయకొండ అమ్మవారి ఉత్సవమూర్తిని కలశాలను గ్రామపెద్దలు, వంశపారపర్యంగా తెచ్చిన వారికి టీటీడీ డిప్యూటీ ఈఓ వీఆర్ శాంతి రాజనాలబండ ఆలయం వద్ద స్వాగతం పలికారు. ఆలయం చుట్టూ మేళతాళాలతో మూడుసార్లు ప్రదక్షిణలు చేయించి ఆలయంలోకి తీసుకొచ్చారు. వివిధ గ్రామాల నుంచి వేలాదిమంది భక్తులు రాజనాలబండకు రావడంతో భక్తులతో కిటకిటలాడింది. భక్తిశ్రద్ధలతో వీరాంజనేయస్వామికి పూజలు చేశారు. ఉట్లోత్సవం, పోకుమాను బరుగుట వంటి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పోకుమాను పైకి ఎక్కడానికి యువకులు పోటీ పడ్డారు. మల్లువారిపల్లె నుంచి రాజనాలబండ వరకు వాహనాల రద్దీ నెలకొనడంతో ట్రాఫిక్ సమస్య నెలకొంది. పోలీసులు రెండు గంటల పాటు శ్రమించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ నాగేంద్ర ప్రసాద్, ఏఈఓ చౌదరి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు భానుప్రకాష్, ధనుంజయరాజు, ఉదయ్‌కుమార్, రాజేష్, శ్రీహర్ష, చంద్రశేఖర్, దిలీప్ తదితరులు పర్యవేక్షించారు.